
న్యూజెర్సీ కథల పోటీలో 150 రూపాయిలు బహుమతిగా అందుకున్న కథ

సికిందరాబాద్‌లో మేం నాటిక పోటీలలో ప్రదర్శించదలచుకున్న ఉషోదయం నాటిక తాలూకు ప్రాథమిక పరిశీలన ప్రదర్శన ముగిసేటప్పటికి సుమారుపదకొండు గంటలయింది.

అక్కన్నుంచీ బయలుదేరి నేము బస చేసిన లాడ్జికి వచ్చాము. పదకొండున్నర అయింది. తాడేపల్లిగూడెం వెళ్ళడానికి 12.45 గంటలకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్ వుంది. గబగబా ముఖం కడుక్కుని, బట్టలు సర్దుకుని, లాడ్జి బిల్ సెటిల్ చేసి బయటపడ్డాము.

ఇంకా ట్రైన్‌కు నలభై అయిదు నిమిషాల టైముంది. ప్రక్కనే వున్న హోటల్‌లో భోం చేసి, స్టేషన్‌కు వచ్చి టికెట్ తీసుకుని ప్లాట్ ఫారంపైకొచ్చి నిలబడ్డాను. కోణార్క్ ఎక్స్‌ప్రెస్ వచ్చి ఆగింది. రిజర్వేషన్ లేకపోయినా, 'టి.టి.ఇ. వచ్చాక సీటుకి రెండు రూపాయిలు కట్టేయచ్చులే' అని రిజర్వేషన్ బోగీలోనే ఎక్కి కూర్చున్నాను. ఆదరా బాదరగా భోం చేసి పరుగెత్తుకొచ్చానేమో, దాహం విపరీతంగా వేస్తోంది. ప్రక్కన కూర్చున్నాయన్ని, సూట్ కేస్ చూడమని చెప్పి క్రిందకు దిగి మంచినీళ్ళు తాగి, మళ్ళా బోగీలోకి ఎక్కాను. క్రితం రాత్రి రిహార్సల్స్ పేరుతో నిద్రపోనిచ్చాడు కాదు మా నాటికకు దర్శకుడు, నాకు ఆప్తుడు అయిన కిషోర్. నిద్ర ముంచుకొచ్చేస్తుంటే బెర్త్‌లు ఏవైనా ఖాళీగా వున్నాయేమోనని పరికించాను. ఒక బెర్త్ ఖాళీగా కనిపించింది. వెంటనే సూట్ కేస్ పైన పెట్టి, చెప్పులు సీటు క్రిందకు తోసేసి, పైకెక్కి పడుం వాల్చాను. ఓ అయిదు నిమిషాలలో నిద్ర పట్టేసింది. ప్రయాణీకుల మాటలు, ట్రైన్ శబ్దం, వెండర్స్ అరుపులు లీలగా వినిపిస్తున్నా, నా నిద్రకు భంగం కలగ లేదు. ఓ అరగంట తర్వాత 'ఉఠో! ఉఠో' అని ఒక గొంతు గట్టిగా వినబడింది. ప్రక్కకు ఒత్తిగిల్లి చూశాను. మరో బెర్త్ పైన పడుకున్న కుర్రాణ్ణి ఓ పోలీసు లేపుతున్నాడు. 'అరే! ఉతరో భాయ్! ఏ బెర్త్ హమారా హై!' అంటున్న అతనివైపు నిశితంగా చూశాను. అతని షర్ట్ షోల్డర్‌కు 'మ.పో.' అన్న రెండు హిందీ అక్షరాలు కలిగిన బాడ్జీ వుంది. అతను హిందీ మాట్లాడుతున్న తీరుని బట్టి, అతని షోల్డర్‌కు వున్న బేడ్జిని బట్టి అతను 'మహారాష్ట్ర' పోలీసు అని అర్థమయింది. ఆ బెర్త్ మీద నుంచి ఆ కుర్రాడు దిగిపోయాక, అతనితో వున్న మరో పోలీసు బెర్త్ మీదకు ఎక్కి పడుకున్నాడు. ఆ కుర్రాణ్ణి లేపిన పోలీసు మాత్రం సీటుపై కూర్చున్నాడు. అతని ప్రక్క ఇంకో పోలీసు, వాళ్ళిద్దరి ప్రక్కన మరో వ్యక్తి కూర్చుని వున్నాడు. ఆ వ్యక్తి ఒకచేతికి బేడీ తగిలించి వుంది. ఇంకోళ్ళు పట్టుకోడానికి వీలుగా ఆ బేడీకి ఓ లావుపాటి తాడు కట్టబడి వుంది. బేడీ చూడగానే నాలో ఉత్సుకత పెరిగింది. బెర్త్ మీద నుంచి క్రిందకు దిగి సీటు మీద కూర్చు న్నాను. ఆ వ్యక్తి వైపు ఒకసారి దృష్టి సారించాను. ఎప్పుడో పాతకాలం ఫ్యాషనైన ఎక్కువ బెల్ వున్న ఫేంటు, పొడుగు చేతుల గళ్ళ చొక్కా, చిందర వందరగా వున్న జుట్టు కొద్దిగా పెరిగిన గడ్డంతో బేడీ వున్న చేతిని కిటికీ ఊచకు ఆన్చి, మరో చేత్తో ఓ దిన పత్రికను సన్నగా మడచి పట్టుకుని చదువుతున్నాడు. అతనికి ఎదురుగా వున్న సీట్లో ఓ యువకుడు, ఇద్దరు యువతులు, ఒక చిన్న కుర్రాడు కూర్చుని వున్నారు. వాళ్ళ మాటల్ని బట్టి వాళ్ళురాజమండ్రి వెళుతున్నట్టు గ్రహించాను. ఆ బేడీతో వున్న వ్యక్తిని చూసి ఆ యువతులు గుస గుస లాడుకోవడం మొద లెట్టారు. అంతలో ఆ వ్యక్తి ఎదురు సీట్లో వున్న యువకునితో మాట్లాడడం మొదలెట్టాడు. 'రాజమండ్రిలో సెంట్రల్ జైలు స్టేషన్నుంచి ఎంత దూరం వుంటుంది బాబూ' అడిగాడా వ్యక్తి. 'దూరమే!' బదులిచ్చాడా యువకుడు. అయితే, 'ఏ టాక్సీలోనో వెళ్ళాలన్న మాట' అని స్వగతంలో అనుకుని 'హమే టాక్సీ మే జానా హోగా!' ప్రక్కన కూర్చున్న పోలీసు నుద్దేశించి అన్నాడా వ్యక్తి. వాళ్ళ సంభాషణను బట్టి ఆ వ్యక్తి పేరు 'సూరి' అని గ్రహించాను. సూరి బొంబాయిలో రెండు మర్డర్లు చేసాడట. అతన్ని కొన్నాళ్ళు బొంబే జైలులోనూ మరికొన్నాళ్ళు పూనా జైలులోనూ వుంచి, అతని కోరికపై ఇప్పుడు రాజమండ్రి జైలుకు ట్రాన్స్‌ఫర్ చేస్తు న్నారట. పిల్లలు చిన్న వాళ్ళుగా వున్నప్పుడే వాళ్ళకు దూరమై పోయానని, ఇప్పుడు తన చిన్న కొడుకు బి.ఇ. ఎంట్రన్స్ రాస్తున్నాడని, కళ్ళు నెత్తికెక్కి తను మర్డర్లు గనక చేసుండక పోతే, పెళ్ళాం, పిల్లలతో హాయిగా కాలం గడు పుతూ వుండే వాడినని, ఆ యువకుడితో చెప్పి, సూరి బాధపడడం గమనించాను నేను. ఇప్పటికే తను పదకొండు సంవత్సరాల కాలం జైలు శిక్ష అనుభవించాడని, ఇంకా ఎంతకాలం అనుభవిం చాల్సి వుంటుందో తనకు ఇతమిద్ధంగా తెలియ దని ఆ యువకుడితో చెప్తుండగా విన్నాను. ఈలోపు అటూ, ఇటూ తిరిగే ప్యాసింజర్లూ, ఎదుటి సీట్లో కూర్చున్న యువతులూ అతన్ని హేళనగా, అసహ్యంగా, భయంగా చూడడం నా కంట పడింది. కానీ, సూరి అలాంటి చూపులకు ఏనాడో అతీతుడైపోయాడన్నట్టు అతని ముఖ కవళికలే చెబుతున్నాయ్. అతను హిందీ చాలా అనర్గళంగా మాట్లాడుతూ, తనను రాజమండ్రి జైలుకు ట్రాన్స్‌ఫర్ చేయడానికి తనతో వస్తున్న మహారాష్ట్ర పోలీసులతో చాలా సరదాగా మాట్లా డుతున్నాడు.



# 'మాలోనివాడివే'

— శ్రీధర శ్రీరామకృష్ణ


ఓ నేరస్థుడు ఓ రక్షక భటుడంటే చూపించాల్సిన భయంగానీ, ఓ నేరస్థుడి పట్ల సాధారణంగా పోలీసులు కఠినంగా ప్రవర్తించే వైఖరిగానీ, వాళ్ళల్లో నాకేమాత్రం కనపళ్ళేదు. ఎదురుగా కూర్చున్న యువకునితో తెలుగులోనూ, తనతో వస్తున్న పోలీసులతో హిందీలోనూ సంభాషిస్తున్నాడు సూరి. ఈ లోపు కాఫీవచ్చింది. పోలీసులు తనతో పాటుగా సూరికి కూడా కాఫీ ఇప్పించారు. కాఫీ తాగిన తర్వాత, వాళ్ళు జరదా వేసుకుని, ఆ జరదా డబ్బాని, సున్నం డబ్బాని సూరికి అందించారు. బేడీ ఉన్న చేతిలోనే కాస్త జరదా వేసుకుని, మరో చేత్తో కాస్త సున్నం తీసి, దాంట్లో వేలుతో బాగా కలిపి, పొట్టులాంటి దాన్ని చేత్తో తడుతూ వేరుచేసి, దాన్ని రెండు వేళ్ళతో తీసుకుని, బుగ్గకో ప్రక్క పెట్టుకున్నాడు సూరి. అతను ఆంధ్రప్రదేశ్ లోని ప్రదేశాల గురించి, పోలీసుల గురించి, రాజకీయాల గురించి, వివిధ విషయాల గురించి, తనతో ఉన్నత పోలీసులతో చెప్తూ, మధ్య మధ్యలో మంచి మంచి జోక్స్ వేసి వాళ్ళను నవ్విస్తున్నాడు. ఇంతలో వేరుశనగ పప్పు పొట్లాలు అమ్మే కుర్రాడు వచ్చాడు. రెండ్రూపాయలిచ్చి ఓ పొట్లం తీసుకుని, తను కాస్త తీసుకుని, ప్రక్కనున్న పోలీసుకి కాస్త ఇచ్చి, మిగిలింది సూరికిచ్చాడు ఓ పోలీసు. సూరి వాగ్ధాటి కొనసాగుతూనే వుంది. ఇంతలో పైన బెర్త్ పైనున్న పోలీసు కూడా క్రిందకు దిగాడు. బండి ఖమ్మం దాటాకా మీల్స్ టిక్కెట్లమ్మే కుర్రాడొచ్చాడు. సూరి మీల్స్ టికెట్స్ తీసుకోమనటం, తను ముగ్గురికీ, సూరికీ కలిపి నాలుగు టికెట్స్ తీసుకుని, ఆ పోలీసు డబ్బు చెల్లించటం జరిగాయ్. సూరి పోలీసులతో కలిసి ప్రయాణించే ఓ మిత్రుడిలా, వాళ్ళకెంతో కావాల్సిన వాడిలా చూసుకో బడుతున్నాడు. ఓ నేరస్థుడ్ని తమ మిత్రుడిలా చూసుకునే వాళ్ళ ఔదార్యానికి నాకు అబ్బురమనిపించింది. 'ఔను మరి! సూరి వాళ్ళలాంటి మనిషేగా! ఏదో ఆవేశంలో విచక్షణ కోల్పోయి, అతను మర్డర్లు చేసుండచ్చు. దానికి తగిన శిక్ష అతననుభవించాడు. అనుభవిస్తూనే వున్నాడు. అంత మాత్రానికి అతను మనిషి కాడా! అతన్ని మనిషిలా చూడకూడదా!'' నాలో భావ సంఘర్షణ చెలరేగింది. విజయవాడలో మిగతా వాళ్ళతో పాటు సూరి, పోలీసులు భోజనాలు చేశారు. సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ''ఎలా కూర్చుని తిన్నాడో చూడవే మహారాజులాగా!'' అని ఓ యువతి నెమ్మదిగా అంటుంటే ''వాడికి వినిపించేట్టు అనకే బాబూ! నిన్ను కూడా పొడిచేస్తాడు?'' అంటోంది మరో యువతి భయం, భయంగా. ఎక్కి దిగుతున్న ప్రయాణీకులు అందరూ సూరిని ఓ పురుగులా, ఓ జంతువులా వింతగా చూస్తూ బుగ్గలు నొక్కుకుని, కనుబొమ్మలెగరేసి, గుసగుసలాడుకుని, ప్రక్కకెళ్ళి ఛీప్‌గా వ్యాఖ్యానించుకుని, రక్షక వ్యవస్థలో భాగమైన పోలీసులపై ఛలోక్తులు విసురుకొని, కాలక్షేపం చేస్తుంటే సూరి అతనితో ఉన్న పోలీసులు మాత్రం వాళ్ళెవరినీ పట్టించుకోకుండా ''మా ప్రపంచమే వేరోయ్!'' అన్నట్టుగా ప్రవర్తిస్తుంటే నాకు చెరబండరాజు రాసిన ఓ మాస్టర్ పీస్ గుర్తొచ్చింది..




''మాలోని వాడివే
మా వాడివే నీవు
పొట్ట కూటికి నీవు
పోలీసువైనావు''

నేను దిగాల్సిన తాడేపల్లిగూడెం స్టేషన్ రావటంతో కళ్ళతోనే, సూరికి వీడ్కోలు చెప్పి దిగిపోయాను. ఓసారి వెనుక్కి తిరిగి సూరిని కిటికీలోంచి చూడాలన్న కోరికను అతికష్టం మీద నిగ్రహించుకున్నాను. వెనక్కి తిరిగి గనక చూసుంటే, ఈ హిపోక్రటిక్ మనుష్యులపై తనకున్న జాలిని కళ్ళల్లో చూపిస్తున్న సూరి చూపులకు తట్టుకోగలనా నేను!


# మరొక విశిష్టమైన ఉత్పత్తి



# రేకాల్డ్

## వాటర్ హీటర్ - స్పెషల్ టెంపరేచర్ లిమిటర్ సౌకర్యంతో



అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు మీముందుకు తెస్తున్న రేకాల్డ్ నుంచి వినూత్నమైన ఉత్పత్తి – 95°C ఉష్ణోగ్రత చేరగానే కరెంటును తనంతతానే ఆఫ్ చేసే స్పెషల్ టెంపరేచర్ లిమిటర్. దీనివల్ల హీటింగ్ ఎలిమెంట్ కాలిపోదు. పైగా మరింత భద్రత సమకూరుతుంది.

ఆంధ్రప్రదేశ్‌కు హోల్‌సేల్ స్టాకిస్టులు:

# రామ ఏజన్సీస్

5-4-17, ఎం.జి. రోడ్, హైదరాబాద్-500 001. ఫోన్: 46282.

TARA•RA•8944